


# కాగితపు పడవలు

రామా చంద్రమౌళి

హెడ్మాస్టర్ రాఘవయ్య బడి వరండాలో చూరుదగ్గర నిలబడి చూస్తూ ఉండిపోయాడు నిశ్శబ్దంగా.

వర్షం కురుస్తోంది జల్లుగా.

రెండురోజుల నుండి ఒకటే ముసురు. ఎడతెరిపి లేకుండా ఒకటే చినుకులు. తడిచిన సబ్బులా నేలంతా మెత్తబడి నానిపోయింది. నగరమంతా...యిండ్లు, చెట్లు, రోడ్లు అన్నీ తడిచి తడిచి అలసిపోయాయి. ఎటుజూచినా బురద... చిత్తడి...రొచ్చు...తేమ.

గుండెల్లో ముల్లు గుచ్చుకున్నట్టు మహా బాధగా ఉంది రాఘవయ్యకు.

"కాని తనేంజేయగలడు...తనేం చెయ్యగలడు–"

"ఏమీ చేయలేదు...ఏ...మీ చేయలేడు."

నిట్టూర్చాడు నిరాశగా....నిస్సహా

యంగా. అప్పుడతను పంక్చరైన సైకిల్ ట్యూబ్‌లా ఉన్నాడు ఒంటినిండా విచారంతో.

"కాని యిలా ఎంత కాలం."

యీ ప్రశ్న నిన్నటినుండి అతన్ని వేదిస్తోంది, అరికాలిలో గుచ్చుకున్న ముల్లులా.

కాని జవాబు దొరకటం లేదు.

అసలు జవాబు ఉంటేగదా దొరక డానికి.

గాలి రివ్వున వీచింది కత్తిలా... చల్లగా.

చినుకులు అతని బట్టతలపై బడి, జల్లుమని ముడుచుకుపోయాడు.

ఎదురుగా పాఠశాల తాలూకు మూడు గదులు పశువుల కొట్టాలకన్నా హీనంగా, సగం ఊడిపోయిన కప్పులతో నవ్వు తున్నాయి కుష్ఠరోగుల్లా. కప్పుపైనుండి రాలిన మట్టిపెళ్ళలు పడి, కురుస్తున్న నీటిలో తడిచి బెంచీలు నల్లగా నాను తున్నాయి. ఒక్కో క్లాసులో గోడకు ఆనించి పెట్టిన బ్లాక్‌బోర్డ్ రంగు వెలిసి తడిచి వైట్‌బోర్డులైనాయి. మూడు క్లాసుల ముఖాలపైనా వరుసగా 8 వ తరగతి, 9 వ తరగతి, 10 వ తరగతి అని రాసిన బొగ్గు అక్షరాలు విద్యార్థుల నొసట రాక్షసులు రాసిన రాతల్లా ఉన్నాయి.

రాఘవయ్య తను నిలబడ్డ వరండా ప్రక్కకు తలపంకించి చూశాడు-తన రంగు వెలసిపోయిన కళ్ళజోడును తీసి చేతిలోపట్టుకుని.

హెడ్మాస్టర్ గదికి ఆనుకుని ప్రక్కన స్టాఫ్‌రూం అనబడే ఓ చీకటి కొట్టం. అందులో ఏ ఒక్కదానికీ సరిగా అవ యవాలు లేని పది పన్నెండు కుర్చీలు. అందులో సున్నపు పెళ్ళలూడిపోతున్న గోడకు జిడ్డు వైర్లతో వ్రేలాడ గట్టిన ఫిలమెంటు రాలిపోయిన బల్బు. ఆ గది కవతల యింకో మూడు రేకుల షెడ్లు. ఏ ఒక్కదానికీ పూర్తిగా రేకులు లేవు. ప్రతి క్లాసునుండీ రేకుల రంధ్రాల గుండా ఆకాశం ముక్కలు కనబడు తాయి అందులోనూ వర్షం కురిసి బెంచీ లన్నీ తడుస్తున్నాయి.

యీ గదులన్నింటి కవతల ఓ మట్టి గోడ కాంపౌండ్‌లో ఓ వంద గజాల ఆట స్థలము కం ఆరుబయట క్లాసులకుపయోగ పడే మల్టీపర్పస్ ప్రదేశము. ఆ స్థలంలో రెండు దిక్కులా రెండు చింత చెట్లు. వాటి నడుమ ఎప్పటిదో చీకిపోయిన గాంధీ సిమెంట్ విగ్రహం.

గాంధీ వానలో తడుస్తున్నాడు మూడురోజుల నుండి ముసురులో.

అలా ఎన్ని ముసుళ్ళు, ఎన్ని ఎండా వానలు, ఎన్ని పక్షుల రెట్టలు పోయాయో గాంధీగారి పైనుండి.

రాఘవయ్యగారు నిలబడ్డ వరండా ముందరినుండి వాననీళ్ళు సన్నగా

కాలువకట్టి నిశ్శబ్దంగా ప్రవహిస్తున్నాయి బయటికి—మురుగుకాలువలోకి.

ఆ మురుగుకాలువ దగ్గరే నిన్ననే గుంజ విరిగిపడిపోయిన పాఠశాల బోర్డ్. "ప్రభుత్వ ఉన్న..పా...శాల..." అక్షరాలు బోనులో నుండి ఎలుకల్లా ఆ పాఠశాలను చూచి బోర్డ్ పైనుండి ఎగిరి పోయినట్టున్నాయి.

"యింతటి మహావైభవమైన ఉన్నత పాఠశాలకు తను ప్రధానోపాధ్యాయుడు"

"యింకా యీ వైభవంలో షిఫ్ట్ సిస్టమ్స్‌లో చదువులు."

"హుం..."

ప్రక్కకు స్టాఫ్‌రూం దిక్కు నడిచాడు రాఘవయ్య.

లాంతరు వెలుగులో కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్న ఉపాధ్యాయులు చటుక్కున లేచి నిలబడ్డారు. ఆ మసక వెలుతురులో వాళ్ళందరూ పాలిపోయిన పాండురోగుల్లానో, శపించబడి చవటలుగా తయారుచేయబడ్డ అమాయకుల్లానో కనబడ్డారతనికి.

"యీ వాన యిప్పట్లో తగ్గేట్టు లేదు..." అని గొణిగాడు రాఘవయ్య స్వగతంలోలా.

"ఔన్సార్."

తలెత్తి చూశాడు రాఘవయ్య.

ఆ మాటన్నది సాంఘికశాస్త్రం చెప్పే దశరథరావు.దశరథరావు వెనుక గోడకు మాసిపోయిన భారతదేశ పటం వేలాడుతోంది.

"స్టూడెంట్స్‌ను యిలా ఎన్ని రోజులని ప్రతిదినమూ పంపిస్తాం యిళ్ళకు."

"మరి అంతకంటే ఏం జేయగలం సార్. కూర్చుంటానికి ఒక్క గజం నేలన్నా పొడిగా లేదు"

"కిరాయి కొంపలో ఉన్నందుకు యిల్లును బాగుచేయించాలన్న ధ్యాస యింటివానికి లేదు. మరి యిలా ఉంటే బడి ఎలా పనిచేస్తుంది అన్న యింగిత జ్ఞానం అధికారులకు లేదు.యిక పిల్లలకు చదువు రమ్మంటే ఎలా వస్తుంది.''

"........." ఎవరూ మాట్లాడలేదు.

"యివన్నీ యిట్లుంచి మొన్న ఆ యిన్‌స్పెక్టరాఫ్ స్కూల్స్‌గాడు యిన్‌స్పెక్షన్ కొచ్చి—విద్యా ప్రమాణాలను యింకా పెంచాల్సి ఉంది. ప్రధానోపాధ్యాయుడు తగిన శ్రద్ధ తీసుకోవలెను—అని రిపోర్ట్ రాసిపోతాడు. వెధవ...''

"........."

"వెనుకటి కెవడో అన్నాట్ట... పెళ్ళాన్ని చేసుకునే ఆచారముంది మాకు కాని కూడు పెట్టే ఆచారం లేదు—అని. అలా ఉంది వీళ్ళ సంగతి యీ బడి కూలిపోతోంది బాబో యిటు చూడండి అని డి.యి.వో.కు ఎన్ని ఉత్తరాలు రాసినా, ఎన్నిసార్లు వ్యక్తిగతంగా మొరపెట్టుకున్నా వినిపించు



కోరు. పట్టించుకోరు. కాని స్టాండర్డులు, ప్రమాణాలు అని కూతలు కూస్తారు కుక్కల్లా. ఏం బడండీ యిది మున్సిపాలిటీ చెత్తకుండీలా. యీ ప్రభుత్వం, యీ విద్యావిధానం పిల్లల జీవితాలను చేజేతులా నాశనం చేస్తోందిగదండీ ఓ బిచ్చపుదాన్ని పట్టుకుని నువ్వు అప్సరసలా అలంకరించుకునిరా పో అని దాని ఒళ్ళంతా చావబాదుతే ఏం జేస్తుందని పాపం.మన గతీ సరిగ్గా అలాగే ఉంది.''

''యీ యింటిని కూడా ఖాళీ చేయమని ఓనరు నరసింహం మొత్తుకుంటున్నాడు గదండి. దాన్నే కాస్త సర్దించి బీడీ కంపెనీకి కిరాయి కిచ్చుకుంటే రెండు వందల యాభై వస్తుందట. వానికిప్పుడు గవర్నమెంటిస్తున్నది దెబ్బయ్యైదేనాయె. వాని ఏడుపులోనూ న్యాయముంది'' అన్నాడు ఓ టీచర్.

"అందరి ఏడుపుల్లోనూ న్యాయం ఉంది. మన ఏడుపూ అంతే. కాని యీ ఏడుపులను వినే నాథుడెవరు యీ సిటీలో ఉన్న యిన్ని స్కూళ్ళలో ఏ ఒక్క దానికైనా స్వంత బిల్డింగుందా. అన్నీ కిరాయి కొంపలే. అందరిదీ యిదే గతి."

"యిప్పుడిక యీ కాస్త నాలుగ్గదులు కూడా ఉండేట్టులేదు సార్. ఓనర్ నరసింహం మా యింటి ప్రక్కనే ఉంటాడుగదా. నిన్న అంటున్నాడు, బడిని ఖాళీచేయించడానికి కోర్టుకు అప్పీల్ చేస్తాడట..."

"అలాగా ..." రాఘవయ్య గొణిగాడు.

"అన్నట్టు రామారావు అడ్వకేట్ - మీ కుమారుడే గదా సార్"

"ఔను."

పెడతారట."

"అలాగా -"

బయట ప్యూన్ గంటకొట్టాడు విద్యార్థులు లేకున్నా. ఎవని డ్యూటీ వానిది.

రాఘవయ్య స్టాఫ్‌రూం నుండి బయటికొచ్చి గదులకు తాళాలువేయించి బయలుదేరాడు.

యింకా వర్షం పడుతూనే ఉంది.

గొడుగు విప్పుకున్నాడు రాఘవయ్య.

గేట్‌దగ్గర యింటికిపోకుండా ఉండి పోయిన విద్యార్థులు వానలో తడుస్తూ మురుగుకాలవలో కాగితాల పడవలాట ఆడుకుంటున్నారు. రాఘవయ్యను చూచి ఎక్కడివాళ్ళక్కడ పరుగుతీశారు గాలికి కొట్టుకుపోతున్న కాగితపుముక్కల్లా.

* * *

యింట్లో...తన గదిలో కూర్చుని రామాయణంలోని కిష్కింధకాండ చదువు కుంటున్నాడు రాఘవయ్య.

ప్రక్కగదిలో తన కొడుకు రామారావు క్లయింట్స్‌కు సలహా లిస్తున్నాడు.

"...అదండీ సంగతి. ఎన్నిసార్లు చెప్పినా, అప్లికేషన్లు పెట్టుకున్నా ఆ బడిని ఖాళీచేయించడంలేదు ప్రభుత్వం. నే నిక కోర్టుకుపోవా లనుకుంటున్నాను." ఆ కంఠం తన పాఠశాల ఉన్న యింటి ఓనర్ నరసింహాది.

నీకా్కవలసింది నీ యింట్లోనుండి బడి వెళ్ళిపోవడం — అంతేకదా. ఆ పని నేను చేయించతాను."

"బాబ్బాబు. ఆ పుణ్యం కట్టుకోండి" - నరసింహం.

"యిప్పుడు బడిలో ఉన్న గదులెన్ని."

"మొత్తం ఎనిమిది."

"అందులో క్లాసులుండేటివెన్ని ?"

"ఆరు."

"ఆ ఆరింటిలో బాగున్న గదు లెన్ని ?"

"ఓ మూడు,"

ఐతే ఓ పని చెయ్యి. యిప్పుడు ఎలాగూ ముసురు ఉంది, ఓ వారం నుండి. రాత్రికి ఓ నలుగురు మనుష లను తీసుకుని ఆ మూడు గదుల గోడలను పడగొట్టించు. నిలవనీడలేక, క్లాసులను నడుపుకోలేక బడి దానంత టదే లేచిపోతుంది. తర్వాత మళ్ళీ కట్టుకోవచ్చు నెమ్మదిగా. దీంతో నీ కయే ఖర్చుకూడా నువ్వు కోర్టుకుపోతే అయ్యే ఖర్చుకన్నా తక్కువే. ఊఁ..."

"అద్భుతం ... అట్లాగే సేత్తానండీ రాత్రికి..."

...యింకా ఏదో మాట్లాడుకుంటు న్నారు.

రాఘవయ్య మస్తిష్కంలో కిష్కింద కాండ తాలూకు కోతులు అరుస్తూ ఎగురుతున్నాయి వికృతంగా.